కొండెక్కుతున్న ఆక్రమణలు

- కాపులదిబ్బడపాలెం కొండపై కబ్జాదారుల కన్ను
- కొండను తొలచి నిర్మాణాలు
- టీడీపీ నేత కనుసన్నల్లో లక్షల్లో వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు


కొండను తొలచి చేపడుతున్న నిర్మాణాలు

కొమ్మాది: కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పూర్తయినా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేకపోయినా, ప్రభుత్వం పేరు చెప్పుకుని స్థానిక టీడీపీ నాయకులు మాత్రం ప్రభుత్వ స్థలాలతో యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తూ లబ్ధి పొందుతున్నారు. ఇచ్చట స్థలాలు అమ్మబడును అనే విధంగా ప్రైవేటు స్థలాల అమ్మకాల మాదిరిగా ప్రభుత్వ స్థలాల అమ్మకాలు చేపడుతున్నారు. కొండలను తవ్వి మరీ ప్లాట్లుగా విభజించి అమ్మకాలు జరుపుతున్నా, నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు కానీ, పట్టణ ప్రణాళిక అధికారులు కానీ, మైనింగ్ అధికారులు కానీ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

టీడీపీ నేత అండతోనే..

జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం దరి కాపులదిబ్బడపాలెం 314 సర్వే నంబరు ప్రభుత్వ స్థలంలోని కొండ ప్రాంతం ఆక్రమణకు గురవుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా పలువురు యథేచ్ఛగా కొండను తవ్వి, నిర్మాణాలు చేపడుతున్నారు. 'మీరు కొండ తవ్వుకోండి.. నిర్మాణం చేపట్టండి.. అధికారులను నేను చూసుకుంటాను'.. అంటూ ఓ టీడీపీ నేత భరోసా ఇస్తూ ఆక్రమణలకు, నిర్మాణాలకు బలాన్ని చేకూరుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కొండపై ఓ వ్యక్తి ఏకంగా కొండను పొడవునా తవ్వి, దర్జాగా నిర్మాణాలు ప్రారంభించారు. దీనిని ఆనుకుని పలు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. దీనికి సమీపంలో సచివాలయం ఉన్నప్పటికీ ఏ ఒక్క సంబంధిత అధికారి కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ స్థలంతో వ్యాపారం చేస్తూ లక్షలు గడిస్తున్న అధికార పార్టీ నాయకులపై రెవెన్యూ అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదంటూ పలువురు అంటున్నారు. ఇప్పటికే ఈ కొండ ప్రాంతం కొంతమేర ఆక్రమణకు గురైందని, ఉన్నది కాస్త తవ్వేస్తే కొండ చరియలు పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు

ఈ కాపులదిబ్బడపాలెం కొండపై రోజురోజుకూ ఆక్రమణలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాస్తవానికి కె.నగరపాలెం ప్రధాన రహదారి వెంబడి ఆనుకుని కొండ వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంది. కొన్నేళ్ల క్రితం సుమారు 150 ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మత్స్యకారులకు అందజేసింది. కాలక్రమేణా ఇక్కడ గజం స్థలం వేలల్లో పలకడంతో ఆక్రమణదారుల కన్ను ఈ కొండపై పడింది. అధికారులు కూడా ఆక్రమణలపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో అడ్డూ అదుపు లేకుండా ఆక్రమణలు జరుగుతున్నాయి. మొన్నటి వరకు నివాసాల మధ్య ఖాళీ స్థలాలు ఆక్రమించుకునేవారు, ఇప్పుడిక ఏకంగా పూర్తి స్థాయిలో కొండను తవ్వి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో, స్థానిక టీడీపీ నాయకుల అండదండలతో ఆక్రమణలు మరలా ఊపందుకున్నాయి. ఇక్కడ 60 గజాల స్థలం సుమారు రూ. 10 లక్షలు పలకుతోంది. దీనిని ఆసరాగా తీసుకుని కొండ ప్రాంతాన్ని ఆక్రమించి పునాదులు వేసి, యథేచ్ఛగా అమ్మకాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల సమన్వయంతో ప్రభుత్వ స్థలాలు సంరక్షించకుంటే.. ఇక్కడ సెంటు స్థలం కూడా ప్రభుత్వానికి దక్కదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కబ్జాదారులపై చర్యలు తీసుకుని, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


కొండపై జరుగుతున్న నిర్మాణాలు

చర్యలు తీసుకుంటాం

కాపులదిబ్బడపాలెం సర్వే నంబరు 314లో ప్రభుత్వ స్థలం ఆక్రమణ మా దృష్టికి వచ్చింది. వీటిని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటాం. ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

– మల్లేశ్వరరావు, ఆర్ఐ, భీమిలి

క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో అన్నకూటోత్సవం


శ్రీవారికి నివేదించిన అన్నరాశి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద గల ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న తిరు పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారికి అన్నకూటోత్సవం నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.సూర్యనారాయణ మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.బంగార్రాజు, హరనాథ రెడ్డి పాల్గొన్నారు.

అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన తిరుపతిరావు

భీమునిపట్నం: భీమిలి జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా ఎం.తిరుపతిరావు శుక్రవారం జోనల్ కార్యాలయం వద్ద బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు కార్పొరేషన్ నుంచి ఆయన ఇక్కడికి రాగా, ఇప్పటివరకు పని చేసిన శ్రీనివాస్ ఏలూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ జోన్ పరిధిలో నిర్మాణాలు నిబంధనలకు లోబడి జరిగేలా చూస్తానన్నారు. అతిక్రమించినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దుర్గాదేవికి కుంకుమార్చన


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: ఆనందపురం పంచాయతీ కార్యాలయం వద్ద మండపంలో విజయదశమి రోజు ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద స్థానిక భక్తులు శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. గాజుల దండ, గజమాలతో అమ్మవారిని అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

హుండీల్లో నగదు అపహరించిన దొంగ అరెస్ట్

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లోని ఆలయాల హుండీల్లో నగదును తస్కరించిన దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్టు క్రైం ఎస్ఐ మురళీకృష్ణ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పెంట శివాలయం, కొత్త కొవ్వాడ పైడితల్లమ్మ ఆలయాల హుండీల్లోని నగదును ఈ నెల 16వ తేదీ రాత్రి కొవ్వాడ పంచాయతీ కొత్త కొవ్వాడ గ్రామానికి చెందిన నైదాన అఖిల్ తస్కరించాడు. దీనిపై నమోదు చేసిన కేసులో అఖిల్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

మందుబాబులకు రూ.3 లక్షల జరిమానా

పీఎం పాలెం: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మందుబాబులకు భారీ జరిమానా విధించారు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి, ద్విచక్ర వాహనం నడుపుతున్న 30 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం కోర్టు ముందు హాజరు పరచగా, న్యాయస్థానం ఒక్కొక్కరికీ రూ.10 వేలు వంతున మూడు లక్షల రూపాయలు జరిమానా విధించిందని స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

ఎలమంచిలికి మాజీ మంత్రి ముత్తంశెట్టి పరామర్శ


ఎలమంచిలి సూర్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణను మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గొల్లలతాళ్లవలసలోని ఆయన నివాసంలో శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అస్వస్థత కారణంగా సూర్యనారాయణ ఆసుపత్రిలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బోని సన్నిబాబు, గొలగాని సన్యాసిరావు, ఎలమంచిలి మురళీకృష్ణ, అక్కరమాని అప్పలనాయుడు, అక్కరమాని రమణ తదితరులు ముత్తంశెట్టిని కలిశారు.

ఆలయం వద్ద సిమెంట్ బెంచీల ఏర్పాటు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కాగితాల గౌతమి అనే మహిళ శుక్రవారం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. తాటితూరు పంచాయతీ కాగితాలపేటకు చెందిన ఆమె భర్త కాగితాల రాజుశ్రీను జ్ఞాపకార్థం ఈ బెంచీలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

డీఎల్ఎస్ఏ కార్యదర్శి పాఠశాలల సందర్శన


చంద్రంపాలెం హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లోని పలు పాఠశాలలను డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ శుక్రవారం సందర్శించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మారికవలసలోని గిరిజన గురుకుల బాలికల స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఏపీ గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ మధ్యాహ్నం భోజనం, పాఠశాలల పరిసరాలు, వంట, స్టోర్ గదులు, రికార్డులు పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచి తదితర అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలు తీసుకున్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పోక్సో చట్టం గురించి వివరించారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు తెలియజేసి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆయా కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారి పి. అనురాధ, చంద్రంపాలెం హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు, గురుకుల ప్రిన్సిపాళ్లు విశ్వనాథం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ హైస్కూల్ సందర్శన

కొమ్మాది: 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ సందర్శించారు. ముందుగా పాఠశాల తరగతి గదులను, వంట గదులను, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని ఏవిధంగా ఏర్పాటు చేస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయిని వానపల్లి శైలజ తదితరులు ఉన్నారు.

ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో వైద్యశిబిరం


పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీఎం పాలెం: సంపూర్ణ ఆరోగ్యానికి మించిన భాగ్యం లేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అన్నారు. బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణతో కలసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో పోలీస్ సిబ్బందికి బీపీ, సుగర్, న్యూరో, కార్డియాలజీకి సంబంధించిన వైద్యపరీక్షలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మాట్లాడుతూ ఇటువంటి వైద్యశిబిరాలను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. అనంతరం సూపరింటెండెంట్‌ను బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, స్థానిక యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఎంఎస్‌పీ కిరణ్ మణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'117 జీవోను రద్దు చేయాలి'

పద్మనాభం: ఎస్‌ఈపీ, 117 జీవో నంబర్ వల్ల ప్రభుత్వ విద్యారంగం తీవ్రంగా నష్ట పోతోందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేద్కర్, కార్యదర్శి ఉప్పాడ రాము పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన యూటీఎఫ్ పద్మనాభం మండల శాఖ స్వర్ణోత్సవ మహా సభలో వారు మాట్లాడారు. తక్షణమే 117 జీవోను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. జీవోను రద్దు చేయాలని కోరుతూ యూటీఎఫ్ సభ్యులు నిరసన తెలిపారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం

యూటీఎఫ్ పద్మనాభం మండల శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షునిగా ఎం.వి.వి.ఎస్.రెడ్డి, గౌరవ అధ్యక్షునిగా బోని చిన్నారావు, సహాధ్యక్షులుగా డి.వి.పార్వతి, కె.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోల సన్యాసిరావు, కోశాధికారిగా ప్రభాకరరావు ఎన్నికయ్యారు.

సామాన్యులపై ధరల భారం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం
- ధరల పెంపుపై సీపీఐ, ఏఐటీయూసీ నిరసన


అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

తగరపువలస: పేద, మధ్య తరగతి ప్రజలపై ధరల భారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగా శుక్రవారం అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ధరల పెరుగుదలపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వంటనూనె, పప్పులు, నిత్యావసర సరకులు, కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయన్నారు. ధరలను అదుపు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక వాగ్దానం చేసిన కూటమి నాయకులు ఎన్నికల తరువాత ఇసుకే అందుబాటులో లేకుండా చేశారన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక కుటుంబాలతో ఆర్థాకలితో జీవిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు మంచి జరిగినట్లు అనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో భీమిలి ఏరియా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కానూరి రాంబాబు, కొండపు ఈశ్వరరావు, చిల్ల నరసింహులు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, నూలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో సీపీఐ నిరసన

మధురవాడ: నిత్యం పెరిగిపోతున్న ధరలను ప్రభుత్వాలు తక్షణమే అదుపు చేయాలని సీపీఐ మధురవాడ ఏరియా సమితి నాయకుడు వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ధరల పెంపును నిరసిస్తూ కొమ్మాది జంక్షన్‌లో సీపీఐ నిరసన తెలిపింది. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అప్పలరాజు, షేక్ మెహిన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభ్యున్నతిలో వార్డు మెంబర్లు కీలకం


మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్

పద్మనాభం: గ్రామ పంచాయతీల అభ్యున్నతిలో వార్డు మెంబర్లే కీలక పాత్ర పోషించాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు గ్రామ పంచాయతీల పరిపాలనపై నిర్వహించిన శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ వార్డు స్థాయిలో ప్రజల తాగు నీరు, డ్రైనేజీల వంటి సమస్యలు మెంబర్లకే తెలుస్తాయన్నారు. ఇటువంటి సమస్యలను వార్డు మెంబర్లు పరిష్కరించాలన్నారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీడీవో ఎం.విజయ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి, ఏవో జయ ఉమ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నిరసన


ఏఈ రవికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.8వేల కోట్ల భారం వేయడానికి కుట్ర జరుగుతోందని భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బైపాస్‌రోడ్డులో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఏఈఈ బొట్ట రవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, విద్యుత్ చార్జీల బాదుడుతో వినియోగదారులపై మరింత భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతోందన్నారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోకపోతే ప్రజా ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జోన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కె.నాగరాణి, పంపాన సూర్యనారాయణ, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు పోటీలు


బీచ్ వద్ద సేకరించిన గవ్వలు, రాళ్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం: పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) వద్ద శుక్రవారం జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ ప్రత్యేక సదుపాయాలు గల పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులు మరింత బాగా చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్, ఒకే దేశం ఒకే ఎలక్షన్ అంశాలపై డిబేట్.. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, క్రీడలు మొదలైన అంశాలపై అభిప్రాయాలు తెలపడం, తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రాధాన్యత కలిగిన వాటి ఫొటోలు, సేకరించిన వాటి ప్రదర్శన నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటారని పోటీలను పర్యవేక్షించిన అసిస్టెంట్ ఏఎంవో డాక్టర్ జి.లక్ష్మి తెలిపారు.

వైభవంగా కనకమ్మ పండగ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామ శివారులో ఉన్న కనకమ్మతల్లికి శుక్రవారం గ్రామస్తులు పండగ నిర్వహించారు. పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అవంతిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు


ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ వీసీ రాజ్యలక్ష్మి, మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: నేటి విద్యార్థులే భావిభారత నిర్మాతలని జేఎన్‌టీయూ విజయనగరం వైస్ ఛాన్సలర్ రాజ్యలక్ష్మి తెలిపారు. చెరకుపల్లి అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఏ విద్య అయినా బాధ్యతాయుతంగా అభ్యసిస్తేనే దానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. ఇస్రో, ఎన్టీపీసీ, ఎన్ఎస్‌టీఎల్ వంటి సంస్థలలో ఉద్యోగ అవకాశాల గురించి తెలియచేశారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవడం ద్వారానే ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్ పి.రామకృష్ణ, మైక్రోసాఫ్ట్ ఆపరేషన్ హెడ్ కొండయ్యపాటి నాగవెంకట్ తదితరులు ప్రసంగించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం


ర్యాలీలో పాల్గొన్న మహిళలు, నిర్వాహకులు

మధురవాడ: మహిళలు పౌష్టికాహారం తీసుకుంటే అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని కుశాల్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే, మెనోపాజ్ డేలను పురస్కరించుకుని కుశాల్ సంస్థ ఆధ్వర్యంలో స్వతంత్రనగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద మహిళలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్లకార్డులు, పోస్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుశాల్ ప్రాజెక్టు కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ కేవీ పార్వతి, జి.హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.లక్ష్మి, బి. జ్యోత్స్న, ఎస్.అప్పలసూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో కానుకల వివాదం

దేవదాయ శాఖ అధికారుల విచారణ


విజయదుర్గ ఆలయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

తగరపువలస: బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆలయ ట్రస్టీ కుసుమహర ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆలయంలో భక్తులు ఇచ్చే కానుకలు దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలతో తమ్మిన వెంకటరావు, రాజగిరి అప్పలరాజు దేవదాయశాఖకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, భీమిలి ఈవో కీర్తి శ్రీనివాసరావు, సంగివలస పోలమాంబ అమ్మవారి ఆలయ ఉద్యోగి కోరాడ శ్రీను విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులను ఆలయానికి పిలిపించిన అధికారులు స్టేట్‌మెంట్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఇరువర్గాల మధ్య స్వల్పంగా తోపులాట చోటు చేసుకుంది. కుసుమహర వర్గానికి చెందిన భక్తులు ఆలయం వద్దకు చేరుకుని దేవదాయశాఖ అధికారులకు మరో స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఏళ్ల క్రితం కుసుమహర పూర్వీకులు దాతల సాయంతో వెంకటేశ్వరస్వామి, విజయదుర్గ ఆలయాలు నిర్మించారన్నారు. దాతలు అందించే అంతంత మాత్రం సాయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, వారంలో రెండు సార్లు అన్నదానాలు, ఉత్సవాల సమయంలో అన్నదానాలు చేస్తున్నట్టు తెలిపారు. కుటుంబంలోని మనస్పర్థల కారణంగానే ఆలయాలపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అమ్మవారిని దర్శించుకుని ఆలయ నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు చేపడతామన్నారు.